క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



పాల్గొన్న సిబ్బంది

యాలాల: సైబర్ నేరాలు, కేంద్ర పథకాలపై యాలాల పీహెచ్‌సీలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ–విడ్స్(వాలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ) తాండూరు సీఎఫ్‌ఎల్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల నుంచి కాపాడుకునే విధానాలను వివరించారు. అనంతరం బడ్జెట్‌ప్లానింగ్, ఆర్థిక అక్షరాస్యత, పొదుపు కథలు, ఆర్థిక క్రమశిక్షణ, పీఎంజేబీ తదితర కేంద్ర పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రూబియా నాజ్, ఎస్‌బీఐ సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు చెన్నప్ప, అఖిల్‌కుమార్, శాంత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పగలే వెలుగులు!



పులుమామిడిలో పగలే వెలుగుతున్న వీధి దీపం

నవాబుపేట: విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సలహాలిచ్చే ఆశాఖ సిబ్బంది, అధికారులు గ్రామాల్లోని వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నా పట్టించుకోవడం లేదు. మండల పరిధిలోని లింగంపల్లి, ఎల్లకొండ, పులుమామిడి, నారెగూడ, పూలపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. కానీ వీటికి ఆన్‌ఆఫ్ స్విచ్‌లు బిగించలేదు. దీంతో విద్యుత్ సరఫరా ఉన్నంత సేపూ బల్బులు వెలుగుతూనే ఉన్నాయి. ఫలితంగా పంచాయతీలకు రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి పాదయాత్ర



పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న భక్తులు

కుల్కచర్ల: మండల పరిధిలోని కామునిపల్లి నుంచి 55 మంది శ్రీవారి భక్తులు కాలినడకన తిరుమల తిరుపతి దేవస్థానానికి బయలుదేరారు. మంగళవారం గ్రామంలో పాదయాత్రగా బయలుదేరిన వారు కుల్కచర్లలో ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేసి పాదయాత్రను కొనసాగించారు. ప్రతీ సంవత్సరం కామునిపల్లి నుంచి భక్తులు పెద్ద ఎత్తున టీటీడీకి పాదయాత్రగా వెళ్తుంటారని గ్రామస్తులు వెల్లడించారు.

అఖిల భారత మహాసభ మండల కమిటీ నియామకం

దౌల్తాబాద్: అఖిల భారత మహాసభ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం సంఘం జిల్లా అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా నర్సింలు, గోవిందు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, రఘు, మన్నె బస్వరాజ్, యాదగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ: మాజీ ప్రజాప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం కాదని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ మంత్రుల ఇళ్ల ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ అరెస్టులతో తమ పోరాటాలను ఆపలేరన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం

బొంరాస్‌పేట: విహారయాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు విహారయాత్రకు వెళ్లి నాగార్జునసాగర్‌ను సందర్శించారు. సాగర్ కట్టడం, ప్రకృతి దృశ్యాల్ని చూసి మైమరిచారు. ఉపాధ్యాయులు మల్లయ్య, చంద్రశేఖర్, వెంకటయ్య, అనిల్‌కుమార్ ఈ పర్యటనలో పాలుపంచుకున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

షాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి సమీపంలోని చిన్న వాగు వంతెన పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు.

కనుల పండువగా రథ సప్తమి

అనంతపద్మనాభుడికి సప్తవాహన సేవ



అనంతగిరి: గరుడ వాహనంపై ఊరేగుతున్న అనంతపద్మనాభ స్వామి వారు



నవాబుపేట: రథోత్సవంలో భక్తుల భజనలు



అనంతగిరి: గజ వాహనంపై ఊరేగుతున్న పద్మనాభుడు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటుగా సప్తవాహన సేవలు నిర్వహించారు. సూర్యప్రభ, హనుమంత, ముత్యాలపందిరి, గరుడ, గజ, సింహ, చంద్రప్రభ వాహనాలపై మాడవీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. ప్రత్యేక హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో ఆలయ ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో 'పసుపు–కుంకుమ'

రథసప్తమి సందర్భంగా మంగళవారం వికారాబాద్ పట్టణంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పసుపు–కుంకుమ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ మందిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పట్టణంలోని మహిళలకు పసుపు, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శిరీష, పట్టణ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి సువర్ణ, కోశాధికారి మమత, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉప కార్యదర్శి శ్రీదేవి, పట్టణ సెక్రటరీ సునీల్, యువజన సంఘం ప్రతినిధి భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: పాల్గొన్న ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రతినిధులు



యాలాల: హనుమంత వాహనంపై సీతా రామచంద్ర స్వామివారి ఊరేగింపు

సీతారామచంద్ర స్వామి వారికి హనుమంత వాహన సేవ

యాలాల: జుంటుపల్లి శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీతాలక్ష్మణ సమేత రామచంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. హనుమంత వాహనంపై ఆలయ వీధుల్లో స్వామి వారిని ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి, చైర్మన్ శ్యాంసుందర్‌రావు, గ్రామస్తులు రవీందర్‌రావు, రాఘవేందర్‌రావు, హన్మంతురావు, భజన మండలి భక్తులు, ఒగ్గడోలు కళాకారులు తదితరులు ఉన్నారు.

రుక్మిణి పాండురంగ స్వామివారి ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని పూలపల్లిలో రుక్మిణి పాండురంగ స్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. గ్రామం నుంచి రుక్మిణి పాండురంగ స్వామి ఆలయం వరకు ఈ రథోత్సవం కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కర్షక, కార్మిక వర్గాలకు అన్యాయం

- కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్
- సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



మాట్లాడుతున్న మాధవరెడ్డి, పక్కన నాయకులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ, శ్రామికవర్గాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ఆరోపించారు. కేవలం కార్పొరేట్లకు ఊతమిచ్చేలా ఉందన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డాగ్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయరంగ సబ్సిడీలకు కోత విధించారని, ఎరువుల రాయితీల్లో రూ.11 వేల కోట్లు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం బడ్జెట్‌లో కేవలం 2.51 శాతమే వ్యవసాయరంగానికి కేటాయింపులు జరిగినట్లు వెల్లడించారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర ఊసే లేకపోవడం సమైక్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా నిధులు రాబట్టలేకపోయాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌పై పునఃసమీక్షించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, బాల్‌రాజ్, బాల్‌రెడ్డి, రజనీకాంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులకు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, ఘనపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఘనపూర్‌లో రూ.5 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజా రవాణ వ్యవస్థను అభివృద్ధితో ప్రజల రాకపోకలు సులువుగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, నాయకులు చిన్నయ్య, బాలయ్య, అంజి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న అమీర్‌పాషా

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణం తిరుమల కాలనీకి చెందిన ఎండీ.అమీర్‌పాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఈ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ఫారూఖ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లాకొత్వాల్ చేతుల మీదుగా అమీర్‌పాషా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి ఎస్ఎ.వాహీద్‌షాఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

జీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల నినాదం కోసమే కాంగ్రెస్ పార్టీ నేతలు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను వాడున్నారన్నారు. షాద్‌నగర్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అర్థంతరంగా ఆగిపోయాయని, త్వరలో ప్రత్యక్ష పోరాటం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, మఠం రుషికేశ్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కుల్కచర్ల: లక్ష డప్పులు–వేయి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు పోరాడుతున్న మంద కృష్ణ మాదిగకు బాసటగా నిలిచి లక్ష డప్పులు–వేయిగొంతులు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరికృష్ణ, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, దిశ కమిటీ జిల్లా సభ్యులు జానకిరాం చౌహాన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్, బిచ్చయ్య, వెంకట్రాములు, వెంకటయ్య, బాలకృష్ణ, భాను, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఉత్తమ్‌చందు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తిలో వాలీబాల్ క్రీడాకారుడు పట్నం రవికాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చందు మాట్లాడుతూ.. తాండూరు ప్రాంతంలో వాలీబాల్‌కు అంటే గుర్తుకు వచ్చేది జినుగుర్తి గ్రామమే అన్నారు. క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మృత్యుంజయ స్వామి, డీలర్ నగేశ్, యువత పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్(చంద్రగిరి)లో వెలసిన శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సావలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శేష వాహనం, ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. స్వామి వారికి 9న గరుడవాహన సేవ, 12న కల్యాణోత్సవం, సాయంత్రం అశ్వ వాహన సేవలు, 13న ధ్వజ అవరోహణతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్తలు రాఘవాచార్ శుక్రవార్, వెంకటాచార్ శుక్రవార్ తెలిపారు.

ఫైలేరియా నియంత్రణకు కృషి



రుద్రారంలో రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని సబ్ యూనిట్ అధికారి ఎస్.పకీరప్ప అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని రుద్రారంలో అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు జ్యోతి, బుద్ర ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మురుగు నీటితో దోమలు పెరిగే అవకావం ఉంటుందని, దోమ కాటుతో వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. ఫైలేరియా వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో 150 మందికి రక్త నమూనాలను తీసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎండీ.రఫీ, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరు

- బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఈ నెల 6 నుంచి మండల సమావేశాలు

ఇబ్రహీంపట్నం: ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతామని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అందలం ఎక్కిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ హామీ సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఉచిత రెండు వందల యూనిట్ల విద్యుత్, రూ.500లకే వంట గ్యాస్, రైతు రుణమాఫీ నామమాత్రంగా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు పరుస్తున్నట్లు ప్రకటనలను ఇస్తుండటం సిగ్గుచేటన్నారు. ఈ నెల 6 నుంచి మండలాల వారీగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై బీఆర్‌ఎస్ శ్రేణులు కదం తొక్కాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నాయకులు బుగ్గరాములు, రమేశ్, కిషన్‌గౌడ్, బహదూర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, బాష, రాంరెడ్డి, చక్రవర్తిగౌడ్, కృపేశ్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, యాదయ్య, నర్సింగ్, వెంకటేశ్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

భౌతికశాస్త్రంలో పురస్కారం



హరికుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: భౌతికశాస్త్రం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా అందజేసే ఉత్తమ పరిశోధన పురస్కారం (2024) నామ హరికుమార్‌ను వరించింది. ప్రస్తుతం ఆయన సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం హెచ్ఓడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ పరిశోధనా పుర్కసారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు. 2024లో హరికుమార్ రాసిన వ్యాసాలు స్కోపస్ సైన్స్ ఇండెక్స్ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆయన శ్రమను గుర్తించిన పరిశోధనా సంఘం ఈ పురస్కారాన్ని బహూకరించింది. కుటుంబ సభ్యులు, కళాశాల సిబ్బంది, సహచరులు హరికుమార్‌ను అభినందించారు.

కులగణన చారిత్రాత్మకం

- కేబినెట్ ఆమోదం హర్షణీయం
- బీసీ సెల్ షాద్‌నగర్ నాయకులు



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చారిత్రాత్మకమని బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. కుల గణనను కేబినెట్ ఆమోదించిన సందర్భంగా బీసీ సెల్ స్థానిక నాయకులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ఈ ప్రక్రియ పూర్తవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, పెంటయ్య, శ్రీధర్, వెంకటేశ్, బసప్ప, గోవర్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కులగణనను తిరస్కరిస్తున్నాం

- అన్ని రంగాల్లో బహుజనులను అణిచివేసే కుట్ర
- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పేరుతో చేసిన గణాంకాలు పొంతన లేకుండా ఉన్నందున కుల గణనను తిరస్కరిస్తున్నామని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే పేరుతో చేసిన గణాంకాలకు, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గణాంకాలకు పొంతన లేకుండా ఉందని ఆరోపించారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో బీసీ, మైనార్టీలను అణిచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తూతూమంత్రంగా సర్వే చేపట్టి 85 శాతం ఉన్న బహుజనులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వాటాలను పెంచే ఉద్యమాలను బలోపేతం చేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు శ్రీనివాస్, కుమార్, మహేందర్, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దళితుల అభ్యున్నతి

పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సురేందర్, జగన్



మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: గత పాలకులు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మింగేశారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దళిత, గిరిజనుల అభ్యున్నతి జరుగుతుందని పార్టీ ఎస్సీ సెల్ నేతలు కరోళ్ల సురేందర్, ఎర్రోళ్ల జగన్, జాంగారి రవి, నాగి సాయిలు, అనిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ నాయకులు ఎస్సీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను మింగేశారని ఆరోపించారు. 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ తీసుకొచ్చారన్నారు. దీని ప్రకారం జనాభా ప్రాతిపదికన దళిత, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చట్టం తీసుకొచ్చారన్నారు. అయితే గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రాజెక్టులకు మళ్లించిందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో గత పాలకులు నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి సుమారు 10 కోట్లు కేటాయించారన్నారు. సమావేశంలో నాయకులు సింగపాగ అనిల్‌కుమార్, ఎంకనోళ్ల శివ, జాంగారి జంగయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.